# పోషణ మాసంతో తల్లి--శిశు ఆరోగ్యంపై అవగాహన

## పోషకాహారం ఎంతో కీలకం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**అశ్వారావుపేట, అక్టోబర్ 8 (తెలంగాణ వాణి):** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులకు చిన్ననాటి నుంచే సమతుల్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన తల్లి--ఆరోగ్యవంతమైన శిశువు--ఆరోగ్యవంతమైన సమాజం లక్ష్యంగా పోషణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎమ్మెల్యే పరిశీలించారు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితర ఆహార పదార్థాల పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల బరువు, ఎదుగుదలను పర్యవేక్షించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డా. నాగేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నివాళి

**అశ్వారావుపేట, అక్టోబర్ 8 (తెలంగాణ వాణి):** అశ్వారావుపేట ప్రాంత ప్రజలకు విశేష వైద్య సేవలందించిన ప్రముఖ వైద్యులు డా. వీరపనేని నాగేశ్వరరావు దశదిన కార్యక్రమం సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆయన



చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ డా. నాగేశ్వరరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అశ్వారావుపేట ప్రాంత ప్రజలకు ఆయన అందించిన వైద్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నిరుపేదలకు వైద్యం అందించడంలో డా. నాగేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, యుఎస్ ప్రకాశ్‌రావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు సంక ప్రసాద్, కలపాల బాబురావు, మాజీ సర్పంచ్‌లు, యువ నాయకులు నారం రాజశేఖర్, సాధు జ్యోత్స్నాబాయి, ఆరేపల్లి రాంబాబు, జీల్ల శ్రీదేవి, అంజి, ఆసిఫ్, నందికొల వెంకన్న, రెహ్మాన్, దుర్గారావు, కృష్ణ, గంగరాజు, పోకల మాస్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్



**జూలూరుపాడు : అక్టోబర్ 08 ( తెలంగాణ వాణి ):** నల్లభండబోడు గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిపోల్చి కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. నల్లబండబోడు పరిధిలో 1,426 ఎకరాల భూమికి సంబంధించి సుమారు 12.50 కిలోమీటర్ల మేర రీ-సర్వే జరుగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూ సరిహద్దుల విషయంలో రైతుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారి భూములు, పంటలు, సమస్యలను తెలుసుకున్నారు. రైతు భూక్యా పంతులు వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలపడంతో, అర్హతను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపీడీఓ తాల్లూరి రవి సర్పంచ్ జి. సింధు, సర్వేయర్, రైతులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

## సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా హెల్త్ క్యాంప్..

## కార్మికుల కాళ్ళు కడిగి ఘనంగా సన్మానించిన బీజేపీ నేతలు





**అశ్వారావుపేట, అక్టోబర్ 8 (తెలంగాణ వాణి)** ప్రజల ఆరోగ్యం, పట్టణాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ నిస్వార్థంగా సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు బీజేపీ నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. బీజేపీ 17వ వార్డు కౌన్సిలర్ పమిడి గీతాశ్రీ, బీజేపీ జిల్లా కార్యదర్శి పమిడి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రజలు నిద్రలేవకముందే విధుల్లోకి చేరి చెత్తను తొలగిస్తూ రోడ్లు, కాలనీలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. ఎండ, వాన, చలి వంటి ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల సేవలను సమాజం గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించారు. కార్మికుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ కౌన్సిలర్ పమిడి గీతాశ్రీ, బీజేపీ నాయకుడు పమిడి లక్ష్మీనారాయణ వారి కాళ్లు కడిగి గౌరవించారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలోని వివిధ వర్గాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. సమాజ నిర్మాణంలో ప్రత్యక్షంగా భాగస్వాములవుతున్న పారిశుధ్య కార్మికులను గౌరవించడం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెట్ట వెంకటేష్, మండల ప్రభారీ ఉడతనేని విశ్వేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి రాయుడు ఆంజనేయులు, మండల కార్యదర్శి మేడవరపు కృష్ణచైతన్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎస్టీ కొండ, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు తానికొండ రాంబాబు, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తంబళ్ల రవి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొట్టిపూళ్ల దుర్గా శ్రీనివాస్, జిల్లా సెల్ కన్వీనర్ సొలస పుష్కర్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రావిక్రింది కుమార్ రాజా, శీమకుర్తి సుబ్బారావు, సోమిశెట్టి లక్ష్మీనరసింహారావు, ములగచర్ల సాయికృష్ణ, పమిడి అప్పారావు, పమిడి సహదేవ్, దమ్మపేట మండల అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా భద్రాద్రి జిల్లా కన్వీనర్ నాగుల చందు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతే ఆయుధంగా పోరాడుతున్న కూటమికి పట్టం కట్టండి

## ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఎంయూ---ఎస్ఈడబ్ల్యూఎఫ్ కూటమిని గెలిపించాలి

## సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి




**కొత్తగూడెం, అక్టోబర్ 8 (తెలంగాణ వాణి):** ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యతతో పోరాడుతున్న టీఎంయూ--ఎస్డబ్ల్యూఎఫ్, టీడబ్ల్యూయూ, ఐఎన్టీయూసీ కూటమికి కార్మికులు పట్టం కట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, సీపీఎం కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం బస్ డిపో వద్ద కూటమి అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ, కార్మికుల ప్రయోజనాల కోసం కూటమి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్మికులకు మెరుగైన పే స్కేల్ సాధించడంతో పాటు డిపోల్లో నెలకొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు. సమస్యలు లేని విధంగా డ్యూటీ పరిస్థితులు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో బాణం గుర్తుకు, రీజియన్‌లో నక్షత్రం గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ గెలిచిన సందర్భాల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని వారు విమర్శించారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయకుండా ప్రభుత్వ అనుకూల వైఖరిని అవలంబించారని ఆరోపించారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, డిపోల్లో మౌలిక సమస్యల పరిష్కారం కోసం కూటమి ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. మోసపూరిత హామీలతో వస్తున్న నాయకులను కార్మికులు తిరస్కరించి ఐక్య కూటమికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, సీపీఎం నాయకులు ఎన్. రమేష్, చింతలపూడి సాయి, డిపో ఎస్డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల నాగేశ్వరరావు, ఇస్నాపల్లి శామ్యూల్, టీడబ్ల్యూయూ అధ్యక్షులు అనిల్, నందిపాటి రమేష్, ప్రమోద్, రామకృష్ణ, షరీఫ్, శివ, నసూర్, రాంబాబు తదితరులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాపాడలేకపోతున్న కార్మిక సంఘాలు!

## పైరవీలకే పరిమితమైన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

## సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు




**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 8 (తెలంగాణ వాణి):** సింగరేణిలో గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల హక్కుల పరిరక్షణను విస్మరించి పైరవీలకే పరిమితమయ్యాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు విమర్శించారు. ట్రాన్స్‌ఫర్, డిప్యూటేషన్, క్వార్టర్, లైట్‌జాబ్, వివిధ అగ్రిమెంట్ల పేరుతో ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి కార్మికుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. గురువారం పీవీకేలో మొదటి షిఫ్ట్‌లో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గత సింగరేణి ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను గెలిచిన సంఘాలు విస్మరించాయని ఆరోపించారు. ముఖ్యంగా సొంత ఇంటి పథకాన్ని కమిటీల పేరుతో పక్కన పెట్టారని, కారుణ్య నియామకాల విషయంలోనూ సాధించామని చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గతంలో 70, 80, 90 శాతం వరకు ఉన్న కార్మికుల ప్రయోజనాలను ప్రస్తుతం 10 నుంచి 12 శాతానికి పరిమితం చేసినా గెలిచిన సంఘాలు యాజమాన్యాన్ని ప్రశ్నించడం లేదన్నారు. కాళ్లు విరగడం, స్టంట్లు పడటం, వివిధ అనారోగ్యాలతో సిక్‌లో ఉన్న కార్మికులను కంపెనీ సర్క్యులర్‌లోని 16 రకాల వ్యాధుల కింద పరిగణించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై పోరాడకుండా విజయాలు సాధించామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసిన బొగ్గుకు సంబంధించి విద్యుత్ సంస్థల నుంచి ట్రాన్స్‌కో, జెన్‌కో ద్వారా రావాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు ప్రశ్నించడం లేదని మంద నరసింహారావు విమర్శించారు. సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నా గెలిచిన సంఘాలతో పాటు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు కూడా స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు సింగరేణి కార్మికుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు సంస్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, సింగరేణిని కాపాడాలనుకుంటున్నారా? లేక ముంచాలనుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కొత్తగూడెం ప్రాంతంలో సింగరేణికి ఉన్న సుమారు 350 ఎకరాల భూమి విషయంలోనూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. వివిధ ప్రాజెక్టుల పేరుతో సింగరేణి స్థలాల కేటాయింపులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రుద్రంపూర్, రామవరం, కొత్తగూడెం ప్రాంతాల్లో కంపెనీ క్వార్టర్లు అన్యాక్రాంతమవుతున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. 40 ఏళ్లకు పైగా నిర్మించిన శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లను తొలగించి వాటి స్థానంలో డబుల్‌స్టోరీ భవనాలు నిర్మించడం ద్వారా కార్మికుల సొంత ఇంటి పథకానికి అవకాశం కల్పించవచ్చని సూచించారు. సీఐటీయూ ప్రతిపాదించిన విధానం ప్రకారం కార్మికులపై అదనపు భారం పడకుండా, కంపెనీపై ఆర్థిక భారం లేకుండా సొంత ఇంటి పథకాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి ఎన్నికల సందర్భంగా కార్మిక సంఘాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

## 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి




**పాల్వంచ, అక్టోబర్ 8 (తెలంగాణ వాణి):** గర్భిణీ స్త్రీలు ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి సూచించారు. పోషణ మాసం సందర్భంగా 'మన అంగన్‌వాడీ--మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా పాత పాల్వంచలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో షిర్డీ సాయినగర్ సెక్టార్‌కు చెందిన గర్భిణులకు శ్రీమంతం వేడుక, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 8 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విమలాదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, సీడీపీవో లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్ కవిత, ఏఎన్ఎం మమత, గర్భిణులు, చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో తొమ్మిది రోజుల పాటు ఘనంగా బతుకమ్మ సంబరాలు

### రేపటి నుంచి 18 వరకు డా. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలు



**కొత్తగూడెం, ప్రతినిధి :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కొత్తగూడెంలో తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. డా. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేపటి నుంచి 18వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ లైన్ విద్యానగర్ కాలనీలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఐదేళ్లుగా కొత్తగూడెం నియోజకవర్గంలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది మరింత విస్తృతంగా కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. డా. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. గడల శ్రీనివాసరావు వేడుకల్లో పాల్గొననున్నారు. వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ అత్యుత్తమంగా అలంకరించిన బతుకమ్మకు పట్టుచీరను ప్రథమ బహుమతిగా అందించనున్నారు. మరో నలుగురు మహిళలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.